# వ్యక్తి శీలము, జాతీయ శీలము రెండింటిని పెంపొందించుకోవాలి

**మాటయందు తీపి మనసున చేదుంచ**
**మంచిది కాదిది మీకు మచ్చగాని**
**మచ్చలేని బ్రతుకె మహిలోన చెల్లురా**
**ఉన్నమాట తెలుపుచున్నమాట**

ప్రేమస్వరూపులారా!

ఒక దేశముయొక్క ఔన్నత్యము ఆ దేశపు ప్రజలపైన ఆధారపడి వుంటుంది. ఒక విధముగ విచారిస్తే ఆ దేశమునందలి మహనీయులయొక్క చరిత్రలే దేశ చరిత్రగా రూపొందుతూ వచ్చింది. చరిత్ర అనగా మంచి సంస్కృతి. మంచి హృదయము, మంచి నడత అని చెప్పుకోవచ్చు. అయితే యెన్ని విద్యలు నేర్చినప్పటికి, యెన్ని ఉన్నత అధికారములు సంపాయించినప్పటికి, అనేక శాస్త్రములందు ప్రవీణుడని పేరుపొందినప్పటికిని, యీ విధమైనటువంటి చిత్తశుద్ధిలేకుండిన, లేక చరిత్రయే రూపొందకుండిన అట్టివారియొక్క జీవితమంతయు నిరుపయోగమైపోతుంది.

చరిత్ర అనగా మరొక విధముగా మనము ఆలోచించి చూచిన సచ్ఛీలము అని ఒక అర్థము. ఈ సత్శీలమునకు పవిత్రము. సహనము, పట్టుదల యీ మూడింటియొక్క యేకత్వము అత్యవసరము. దీనినే శీలత్రయములని పిలుస్తూ వచ్చారు. ఈ మూడింటితోపాటు ధైర్యము, సాహసము, పట్టుదల, త్యాగము, పరాక్రమము. ఈ మూడింటితోపాటు యీ పైగుణములన్నియుకూడినప్పుడే మానవుడు యీ జగత్తునందు అనేక విధములైనటువంటి విజయాన్ని సాధించగలడు. ఆదర్శమును నిరూపించగలడు.

కేవలము పవిత్రత, సహనము, పట్టుదల వుండి మిగిలినటువంటి ధైర్యము, సాహసము, త్యాగము, ఔదార్యము యిలాంటి గుణములు లేకుండిన మానవత్వములో ఆదర్శవంతమైన విజయమును సాధించటము దుర్లభము.

**ఈనాడు వ్యక్తిగతశీలము దినదినమునకు దిగజారిపోతున్నది**

ఇక్కడ శీలము అనేటువంటిది రెండు విధములుగా వుంటున్నది. వ్యక్తిగతశీలము ఒకటి. రెండవది జాతీయశీలము. అనగా Individual character, National character. ఈ వ్యక్తిగతమైనటువంటి శీలమునకు అనేకవిధములైన ప్రయత్నములు, సాధనలను చేయవలసివస్తుంది. ఈ వ్యక్తిగతమైనటువంటి శీలము గ్రంథములలో నేర్చుకునేటువంటిదికాదు. లేక గురువులచేత బోధింపబడేటువంటిదికాదు. బజార్లో లభించేటువంటిది అంతకంటే కాదు. దీనిని నిత్యసాధనలచేతను, సత్సంకల్పములచేతను. సత్ప్రవర్తనలచేతను పెంచుకోవాలి. యీనాడు వ్యక్తిగతమైనటువంటి శీలము దినదినమునకు దిగజారిపోవుచున్నది. నైతికమునందుగానీ, ధార్మికమునందుగానీ, ఆధ్యాత్మికమునందుగానీ, లౌకికమునందుగానీ, వైజ్ఞానికమునందుగానీ, రాజకీయమునందుగానీ యీ వ్యక్తిగతమైన శీలము పూర్తిగా క్షీణించిపోయింది. ఈనాటి సమాజములోపల కేవలము భుజబలము, బుద్ధిబలము, ధనబలము, జనబలము, వాక్‌బలము యీ ఐదు బలములను మాత్రమే ప్రధానముగా చూస్తున్నారు. వ్యక్తిగతమైన శీలతత్త్వాన్ని యెవరూ విచారించటంలేదు. దానియొక్క విషయమునేమాత్రము గుర్తించటంలేదు.

ప్రాచీనకాలమందు యీ వ్యక్తిగతశీలమును కలిగినటువంటి వ్యక్తులనే ఆదర్శమైనటువంటి వ్యక్తులుగా భావించేవారు. అట్టి మహనీయులనే తత్త్వవేత్తలని, ఆచార్యులని పిలిచేటువంటివారు. అట్టి మహనీయులు స్థాపించినటువంటి చరిత్రలే ప్రపంచమునకు ప్రధానమైనటువంటి వెలుతురుగా లోకానికి కనిపిస్తూ వచ్చేటువంటిది. అయితే యిట్టి చరిత్రాత్మకులైన మహనీయులు ఆనాటినుండి దేశముయొక్క ఔన్నత్యమును, పవిత్రతను కాపాడుతూ వచ్చేటువంటివారు. ఈ విధముగా వ్యక్తిగతమైన శీలము

sri sathyasaivachanamrutam

దినదినాభివృద్ధి గావించుకుంటూ క్షణక్షణమునకు పరిశీలన చేస్తూ దానిని పోషించుకుంటూ రావాలి. ఇట్టి వ్యక్తిగతమైన శీలము ఒక్కటి వుండినంత మాత్రమున మనము కార్యములు సాధించలేము. దేశోద్ధారణకుగానీ, దేశముయొక్క ఆదర్శమునకుగానీ యీ వ్యక్తిగతశీలము అంతగా ఉపయోగించదు. తనను తాను తరింపచేసుకోవచ్చును. తనకు తాను తృప్తి గావించుకోవచ్చును. అయితే, సమాజములో చేరి సమాజముయొక్క ఔన్నత్యాన్ని అభివృద్ధిపరచవలెనన్న వ్యక్తిగతశీలముతో బాటు జాతీయశీలముకూడను అత్యవసరము.

**జాతీయశీలమనగా దేశభక్తి**

జాతీయశీలత అనగా దేశభక్తి. వ్యక్తిగత శీలము మాతృప్రేమవంటిది. జాతీయశీలము National character అనేది దేశభక్తితో కూడినటువంటిది. అనగా దేశమును ప్రేమించటము. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని స్వర్గముకంటేకూడ యీ జన్మభూమియొక్క ఔన్నత్యము, జన్మమునందించినటువంటి తల్లియొక్క ప్రేమతత్వము అత్యంత ప్రధానమైనవని భావించి పోషించుకుంటూ వచ్చారు. వ్యక్తిగత శీలము తల్లితో సమానము. జాతీయశీలము దేశముతో సమానము. రెండింటియొక్క చేరికనే నెగిటివ్, పోజిటివ్‌గా యేర్పడి తద్వారా అనేక విధములైన అనుకూలములు గావించుకున్నట్టుగా వుంటుంది. లోకములో జాతీయ శీలము కలిగినవారు అనేకములుగా వుంటుండవచ్చు. కానీ వ్యక్తిగతశీలమే లేకుండిన జాతీయశీలమనేదానికి జగత్తులో విలువలేదు. ఒకవేళ వ్యక్తిగతశీలము వుండినప్పటికి, జాతీయశీలము లేకుండిన తాను రాణించలేడు. అంతేకాక దేశము ఔన్నత్యాన్ని సాధించలేదు. దేశముయొక్క ఔన్నత్యాన్ని సాధించటమే ప్రతిమానవుని కర్తవ్యము. ఏ దేశమునందు ఆ వ్యక్తి జన్మించెనో ఆ దేశముయొక్క ఔన్నత్యాన్ని తాను కోరి, ఆశించి, ఆచరించి, అభివృద్ధికి తెప్పించటము తన కర్తవ్యము. ఈనాడు జాతీయశీలము వుండినప్పటికి, అనేక విధములుగా ప్రజలు త్యాగము చేసినప్పటికి శాశ్వత ప్రాతిపదికపై దేశాభివృద్ధిని సాధించలేకపోతున్నారు.

**వ్యక్తిగత శీలముతోబాటు జాతీయ శీలముకూడా అత్యవసరమనే సత్యమును గుర్తించాలి**

భారతదేశము స్వరాజ్యమును పొందే నిమిత్తమై అనేకమంది మహనీయులు తమ

sri sathyasai vachanamrutam

ధనమును, తమ మనస్సును, చివరకు తమ దేహమునుకూడను త్యాగముచేసి స్వరాజ్యమును సాధించారు. వీరు జాతీయశీలమును ప్రధానముగా యెంచుకొని తద్వారా యీ కార్యమును సాధిస్తూ వచ్చారు. అయితే యీ జాతీయశీలము క్రమక్రమేణా దిగజారిపోతూవచ్చింది. మాన్‌సింగ్ అనేటువంటి భారతీయుడు విదేశీయ చక్రవర్తి అయిన అక్బర్‌కు లొంగి దాసుడై అనేక విధములుగా భారతదేశమునకే కొన్ని యిక్కట్లు కలిగించటానికి ప్రయత్నించాడు. రాణాప్రతాప్‌ను చాలా హింసించాడు. తీరని బాధలు కలిగించాడు. అక్బరు చక్రవర్తి అందించిన ధన కనక వస్తు వాహనాదులకు లొంగాడు. జయసింహుడుకూడను ఔరంగజేబ్‌నకు లొంగి, స్వార్థ, స్వప్రయోజనములకు లోబడి దేశభక్తుడు, దైవభక్తుడు, ధర్మప్రీతి కలిగినటువంటి శివాజీపైన యుద్ధమునకు పూనుకున్నాడు. మరొకడు జయచంద్ర. ఇతను గోరీ మహమ్మద్‌కు లోబడి తద్వారా పృధ్వీరాజును చాలా హింసించాడు. పృధ్వీరాజు మహావీరుడు. కానీ నమ్మకమైనటువంటి వ్యక్తిగా భావించాడు, జయచంద్రుని. కానీ నమ్మినటువంటివాడే ద్రోహమునకు పూనుకున్నాడు. ఇంతేకాదు. అనేకమంది పండితులు, పూజారులు, వేదశాస్త్రయితిహాస పురాణములంతా అనేక విధములుగా తర్కించి వాదించి జయించినటువంటివారు విదేశములనుండి భారతదేశముపై దండెత్తి వచ్చిన మహమ్మదీయ రాజులకు లోబడి సోమనాథదేవాలయాన్ని అప్పగించారు. వారు భారతదేశమునుండి కొన్ని వందల యేనుగులు మోసేంత బంగారమును తమ దేశములకు తరలిస్తూ వచ్చారు. దీనికి కారణమేమిటి? భారతదేశములో వీరులు లేకపోలేదు. బలవంతులు లేకపోలేదు. శూరులు లేకపోలేదు. పరాక్రమవంతులు లేకపోలేదు. పండితులు లేకపోలేదు. జాతీయశీలత కోల్పోటముచేతనే యీ విధమైనటువంటి దుర్మార్గమునకు గురైపోయింది, భారతదేశము. కనుకనే వ్యక్తిగతశీలముతోబాటు జాతీయశీలముకూడను అత్యవసరమనేటువంటి సత్యాన్ని గుర్తించాలి.

దీనికి సహనము అత్యవసరము. భారతదేశములో స్వరాజ్యముకొరకు అనేక విధములుగా పాటుపడిన మహనీయులు యెంతోమంది వుంటున్నారు. అందులో మొదటివాడు గాంధీ. ఆయనతోబాటు వల్లభాయిపటేల్, బాలగంగాధరతిలక్, సుభాస్



sri sathyasai vahini amrutam

చంద్రబోస్, రాజారామ్‌మోహన్ రాయ్, మదన మోహన మాలవ్య, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్, నెహ్రూ మొదలగువారు. వీరు మాత్రమే కాకుండా యింకా అనేకమంది వీరిని అనుసరించి, ఆశ్రయించి, ఆదరించి, ఈ ఉద్యమములో ప్రాణములు సైతం త్యాగము చేయటానికి సంసిద్ధులైన భారతీయులు వున్నారు. అయినప్పటికిని వారిలో కొంతమంది జాతీయశీలతను అభివృద్ధి గావించుకొనిరే గానీ వ్యక్తిగతశీలము లేకపోవటంచేత వారి పేరు, ప్రతిష్ఠలు అతి శీఘ్రకాలములోనే మాసిపోతూవచ్చాయి. అందరూ great persons అని చెప్పటానికి వీలులేదు. లౌకికంగా, భౌతికంగా, రాజకీయంగా వీరందరు మహనీయులు కావచ్చును. లోకరీతిగా బాహ్యమైన కర్మలను మాత్రమే ఆదర్శముగా తీసుకొని వారిని మహనీయులుగను, ఆదర్శవంతమైన పురుషులుగను విశ్వసించవచ్చునేగానీ దైవ దృష్టియందు వ్యక్తిగతశీలము, జాతీయశీలము రెండూ ప్రధానమైనవే! దేశక్షేమాన్నికూడను ఒక వైపు దృష్టియందుంచుకోవాలి. 'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవ స్సనాతనః'. జీవులకు దేహముయెట్లు దేవాలయమువంటిదో భగవంతునికి దేశముకూడను అటువంటి దేవాలయమువంటిది. కనుక యిలాంటి పవిత్రమైనటువంటి దేశముయొక్క స్థితిని మనము గుర్తించకుండా పోయిన యెంత గొప్పశీలవంతుడైనప్పటికి యిది రాణించదు. తద్వారా జగత్తుకు యేమాత్రము వుపకారము లేదు.

తోటిమానవులకు, దేశములో తనతోపాటు జన్మించిన సోదరమానవులకు సానుభూతిని చూపించి, సహనభావమును నేర్పి సత్శీలము అభివృద్ధి పరచేటువంటి మార్గములో ప్రతివ్యక్తికూడను పాల్గొనాలి. మానవత్వమునకు సుఖము, దుఃఖము వెంటగా జంటగా వుంటాయి. 'సుఖదుఃఖ సమానస్య లాభో లాభ జయాత్' అని సుఖదుఃఖములు రెండింటిని సమత్వముతో భావించుకునేటువంటి సమరసమును మనము నేర్చుకోవాలి.

**అవతారపురుషుడొక్కడే వ్యక్తిగతశీలము, జాతీయశీలము రెండింటిమధ్య సమత్వము కలిగి ఉంటాడు**

శ్రీరామచంద్రుడు సూర్యోదయమైన తక్షణమే పట్టాభిషేకమునకు సిద్ధమయ్యాడు. కానీ యీ పట్టాభిషేకము తనకు జరుగదు అని అతనికి తెలియకపోలేదు. తెలిసినప్పటికినీ

sri sathyasai vahini

పితృవాక్యపరిపాలన, కన్నతండ్రిని, కన్నతల్లులను బాధపెట్టకూడదు అనే భావముతో తాను ఆచరిస్తూ, అనుసరిస్తూ వెళ్లాడు. కాలకర్మకారణకర్తవ్యములు కలసిరావటంచేత తన ప్రయత్నముకూడ విఫలమైంది. ఏడుగంటలకు పట్టాభిషేకము జరుపుకొనవలసినటువంటి శ్రీరామచంద్రుడు అదే యేడుగంటలకు అరణ్యవాసము పోవలసివస్తే యిది మానవత్వతతో వుండినటువంటి యే వ్యక్తికైనను చాలా బాధాకరమైనటువంటి విషయముగా వుంటుంది. ఇది భరించలేని బాధగా వుంటుంది. కానీ శ్రీరామచంద్రుడు యిలాంటి వికారమునకు యెన్నడును అవకాశమివ్వక పట్టాభిషేకమునకు యే చిరునవ్వుతో వచ్చాడో అదే చిరునవ్వుతో అరణ్యానికి వెళ్లటానికికూడా సిద్ధమయ్యాడు. ఇదే సమత్వమునకు సరైన గుర్తు.

లోకములో వ్యక్తిగతశీలము, జాతీయశీలము యీ రెండింటియొక్క సమత్వముతో కూడినటువంటి వ్యక్తి ఒక్క అవతారపురుషుడు తప్ప, అన్యమానవులందు అంతో యింతో భేదమువుంటుంది. అట్టి వారిని మనము ఆదర్శముగా తీసుకోటమే వుత్తమమైనటువంటి మార్గము. ఇంక జాతీయశీలతవుండికూడను వ్యక్తిగతశీలము లేనప్పుడు అనేక సమయాలలో ఒక పరిస్థితియందు దుష్ఫలితాలు కలుగుతూ వస్తుంటాయి. ప్రతి మానవుడు జాతీయశీలత దృష్టియందుంచుకొని దేశసౌభాగ్యమును మొట్టమొదట మనము కోరాలి. దీనిని అర్థముచేసుకోవాలి. దేశమంటే యేమిటి? ఎవరికోసము యీ దేశము యేర్పడింది? ఎవరి వల్ల యిది దేశము అని పిలువబడుతున్నది. దేశమునకు వుండవలసిన లక్షణములు యేమిటి? ఆ లక్షణాల్ని పెంపొందించవలసినటువంటి వ్యక్తులు యెవరు? ఇటువంటి వ్యక్తులతత్వాన్ని మనము గుర్తించినప్పుడే యిది జాతీయశీలతగా రూపొందుతూవస్తుంది. ఒక చిన్న ఉదాహరణము. మీకు తెలుసున్న విషయములనే వుదాహరణముగా చెప్పినప్పుడే మీకు చక్కగా అర్థమవుతుంది.

దక్షిణ ఆఫ్రికానుండి వచ్చిన తరువాత గాంధీ జాతిమత భేదములు లేకుండా సామాజిక జీవితములోపల సమత్వాన్ని రూపొందింపజేయాలి అని సంకల్పించుకున్నాడు. ఏ విధముగానైనా భారతదేశమును దాసత్వమునుండి కాపాడి పాశ్చాత్యులను దూరముగావించాలని సంకల్పించుకున్నాడు. తాను అనేక మందిని చేర్చుకొని విప్లవాలలో

పాల్గొన్నాడు. అలహాబాద్‌లో అప్పుడు హైకోర్టు జడ్జిగా వుండినటువంటివాడు నెహ్రూతండ్రి, మోతీలాల్. ఇలాంటి ధనవంతులైనవారిని, కొంతవరకు పేరు, ప్రతిష్టలు వుండినవారిని యీ వుద్యమములో తీసుకున్నప్పుడు కొంతవరకు సహాయముగా వుంటుందనే ఉద్దేశ్యముతో గాంధీ మోతీలాల్‌ను సంప్రదించాడు. ఆ మోతీలాల్ అనేక భోగభాగ్యములలో మునిగితేలేటువంటివ్యక్తి. గొప్ప శ్రీమంతుడు. ఆ కాలములో నెలకు నలభైవేలరూపాయలు సంపాదించేవాడు. అతని భవనములన్నీ రాజభవనములుగా వుండేటువంటివి. కానీ గాంధీ మాటను తిరస్కరించక ఆ భవనమును స్వరాజ్యభవనముగా మార్చి గొప్ప త్యాగము చేసి తాను కాంగ్రెసులో ప్రవేశించాడు. అతతోబాటు అతని భార్య అయిన స్వరూపరాణికూడను యిందు పాల్గొనింది. ఈ ఉద్యమములో పాల్గొనటంచేత యిరువురు కొన్ని విధములైనటువంటి యిబ్బందులకు గురి అయ్యారు. ఆ సమయములో నెహ్రూకూడా యిందులో ప్రవేశించాడు. అప్పుడు 1942లో గాంధీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఈ ఉద్యమములో యిరువురికి కొన్ని భేదాభిప్రాయములు ప్రారంభమైనాయి. నిర్దాక్షిణ్యముగా గాంధీ, నెహ్రూను ఆ వుద్యమమునుండి తొలగించాడు. కానీ నెహ్రూకూడను సామాన్యమైనటువంటివాడుకాదు. పట్టుపడితే ప్రాణమైనా వదిలేటువంటివాడు కానీ పట్టువిడచేటువంటివాడుకాదు. ఉద్యమములో మెంబరు కాకపోయినా ఎక్కడికి వెళ్లినా గాంధీతో వెనువెంటనే ఉంటూ వచ్చాడు, నెహ్రూ. ఈ విధమైన సహనాన్ని గుర్తించుకుంటూ వచ్చాడు, గాంధీ. ఈ వుద్యమమునుండి తొలగించటానికి కారణమేమిటి? ఇక్కడే వ్యక్తిగతమైన తత్వమును గుర్తించుతూ వచ్చారు characterలో. దానిని దృష్టిలో ఉంచుకుని యీ ఉద్యమమునుండి నెహ్రూను తొలగించాడు. కానీ పెరుగుతూ పెరుగుతూ పోయేటప్పటికి కలసి మెలసివుండె వ్యక్తులయొక్క తత్వాలు చక్కగా అర్థము చేసుకోటానికి వీలవుతుంది. నెహ్రూ తత్వాన్ని గాంధీ కనిపెట్టినప్పుడు గాంధీ తత్వాన్ని నెహ్రూకూడా కనిపెడుతూ వచ్చాడు. తద్వారా యిరువురియొక్క బలహీనతలు గుర్తించుకొని ఒకరికొకరు మరి చేరిపోయారు. కారణమేమిటి? మానవునియందు శీలతత్వములో బలహీనతలు బయటపడిన తరువాత యింక వానియొక్క గౌరవ మర్యాదలు క్రమక్రమేణా తగ్గిపోతూవస్తాయి. స్వరాజ్యము వచ్చిన

sri sathyasai vacahamrutam

తరువాత తక్షణమే నెహ్రూను ప్రధానమంత్రిగా చేశాడు గాంధీ. ఈ నెహ్రూ మొట్టమొదట చేసినటువంటిదియేమిటి? రష్యావారితో సంప్రదించి పంచవర్షప్రణాళికను ప్రారంభించాడు. ఈ ప్లానులు రష్యావారితోనే కలసి ప్రారంభమైంది. ఈ విధముగా స్వరాజ్యమును సాధించుకొని పరరాజులయొక్క ప్రబోధనలననుసరించటంచేత క్రమక్రమేణా బలము తగ్గిపోతూవచ్చింది. నెహ్రూకు సామాన్యమైన జీవితముపైన చాలా అభిరుచి. ఈ రకమైన సామాజిక జీవితమునందు అభిరుచి పెంచుకోవడంచేత క్రమక్రమేణా secular state అనేటువంటిది ప్రారంభించాడు. అనగా సర్వమతములవారికి భారతదేశము సమన్వయమైనటువంటిది. 'ఏ మతమువారుకూడను ఒకరినొకరు దూషించు కోకూడదు, విమర్శించకూడదు', అనేటువంటి భావములు అభివృద్ధి పరచారు. ఇది మంచిదే! నేను యీ విషయం చెప్పటంలో కారణమేమనగా రాజకీయ తంత్రంలోపల అనేక కుయుక్తులుకూడను అభివృద్ధి అవుతూవుంటాయి. ఇలాంటి కుయుక్తులు లేకుండా పోయినప్పుడు రాజ్యమును పరిపాలన చేయటమే చాలా కష్టమవుతుంది.

**జాతీయశీలము, వ్యక్తిగతశీలము రెంటినీ ఏకత్వముచేసి దీనిలో ఆత్మతత్త్వమును అనుభవించాలి**

అయితే ప్రాచీన కాలమునందు యిలాంటి యుక్తులకుగానీ, కుయుక్తులకుగానీ అవకాశము వుండేదికాదు. వారివి హృదయమునుండి హృదయమునకు అందించుకొనేటువంటి సహజస్వభావాలు. కనుకనే వారియొక్క జీవితాలన్నీ చరిత్రలుగా నిలిచిపోయాయి. ఆ చరిత్రలన్నీ పవిత్రముగా ఉండేవి. కానీ, యీనాటి వారి ఆదర్శములు చరిత్రలకింద రూపొందలేదు. ఇందులో వెతికినా పవిత్రత మనకు చిక్కటంలేదు. ఎప్పుడు యీ పవిత్రత మనకు లభిస్తుంది? వ్యక్తిగతశీలము, జాతీయశీలము రెండింటిని యేకత్వముగావించి దీనిలోపల ఆత్మతత్త్వము అనుభవించాలి. అదియే విశాలమైనటువంటి తత్త్వము. మనము చేసే ప్రతి పనియందు యీ రెండింటియొక్క తత్త్వాన్ని గుర్తించి వర్తించాలి. ఈ పనివల్ల నా వ్యక్తిగతశీలమునకేమైనా భంగము జరుగుతుందా లేదా జాతీయశీలతకు యేమైనా అడ్డుతగులుతుందా అని విచారించి ఆ కార్యములో మనము ప్రవేశించాలి. మన మతమునకు యేమాత్రము అడ్డుతగలక దేశక్షేమమునకు యేమాత్రము

sri sathyasai vachanamrutam

అడ్డుతగలక వుండేటువంటి మార్గమును మనము అవలంబించాలి. అనేకమంది మహనీయులు తమయొక్క రాజ్యమును స్వతంత్రమైన రాజ్యముగా రూపొందింప చేసుకోవాలని ప్రాణాలనుకూడను త్యాగము చేశారు. నేటివరకుకూడను దీనియందు పోరాడుతూనే వున్నారు. ఇది జాతీయశీలత అని చెప్పవచ్చును. మన విద్యకు సంబంధించినటువంటివి జాతీయశీలత, వ్యక్తిగతశీలత. యీ రెండింటిని మనము దృష్టియందుంచుకొన్నప్పుడు యెట్టి వ్యాపారమైనందైనాగానీ, యెట్టి వుద్యోగమునందైనగానీ, ఎట్టి విధమైనటువంటి రంగమునందైనాగానీ రాణించవచ్చును. విజయాన్ని సాధించవచ్చును. మొత్తముపైన వ్యక్తిగతశీలము మనము పోషించుకోవాలి. దృష్టియందుకాని, మనసుయందుకానీ, చేష్టలయందుకానీ మన వ్యక్తిగతశీలమునకు భిన్నముగా వుండరాదు. లోకములో యేబలము లేకపోయినప్పటికి యీ వ్యక్తిగతశీలమే మనకు ప్రధానమైన బలము, ఆధారమైన బలముగా తీసుకోవాలి.

**అహంకార నిర్మూలనే బ్రహ్మర్షికి సరైన అర్హత**

వశిష్ట, విశ్వామిత్రులమధ్య వున్న భావాన్ని యిందులో మనము యోచించవచ్చు. అహంకారరహితమై, ఆనందమయుమై, నిస్వార్థరూపుడై, నిర్మలచిత్తుడై కర్తవ్యాన్ని నిర్వర్తించుటకు, కార్యమును సాధించటానికి ప్రయత్నించినటువంటివాడు వశిష్టుడు. ఒకానొక సమయములో ధశరథ మహారాజునకు చెబుతూవచ్చాడు, "అయ్యా! ధశరథమహారాజా! మేము సర్వ సంగపరిత్యాగులము, సకలశక్తిసంపన్నులము. మాకు కావలిసినటువంటిది యేమీలేదు. అయితే, నేను మీవద్ద పురోహితునిగా వుండుటకు కారణం యేమిటి? మీ వంశములో శ్రీరామచంద్రుడు వుద్భవిస్తున్నాడు. అటువంటి భగవత్స్వరూపముయొక్క సన్నిధిని, పెన్నిధిని అనుభవించాలనే కాంక్షచేతనే నేను మీవద్ద పురోహితునిగా నియమితమయ్యాను. మీరేమో రాజులు, మాకేదో గొప్పగా సిరిసంపదలు అందిస్తారనే దురాశచేతగానీ, ఆశచేతగానీ మేము యిందులో ప్రవేశించలేదు". అనగా లక్ష్యము దైవముపైన వుంచటము. దృష్టిని దైవముపైనవుంచి కర్తవ్యకర్మలను నిర్వర్తించుకొని రావటము, యిది వశిష్టులవారి సహజలక్షణము. విశ్వామిత్రుడు అట్లుకాదు.

sri sathyasai vachanamrutam

పరులమంచితనాన్ని గానీ మంచినిగాని చూచి సహించలేనటువంటివాడు. వశిష్టులవద్దనున్న కామధేనువుయొక్క తత్వాన్ని గుర్తించి, ఆ కామధేనువు రాజుదగ్గర వుండవలసినదిగానీ, ఋషుల దగ్గరవుండవలసినదికాదు అని చెప్పి దౌర్జన్యముతో కామధేనువును తనవెంట తీసుకువెళ్లాడు. అహంకారప్రేరితుడైస్వార్థము, స్వప్రయోజనము దృష్టియందుంచుకొని మహనీయులను హింసించి, వారి మనసులకు కష్టము కలిగించి పవిత్రమైనటువంటి వస్తువును తాను అపహరించటానికి ప్రయత్నించాడు. తనది కానటువంటి దానిని తనదిగా అనుభవించటానికి ప్రయత్నించేటువంటివాడు దొంగ అని మొన్నకూడ చెప్పాను. ఇలాంటి విశ్వామిత్రునికి యేవిధముగానైనను బుద్ధి చెప్పి అతనిని సరియైన మార్గములోనికి తెప్పించాలని వశిష్టుడు అనేక విధములుగా ప్రయత్నము చేశాడు. మహర్షులకు కోపం వుంటుందని అనుకుంటారు. వ్యక్తిగతశీలముతో బాటు ధైర్యము, పరాక్రమము, సహనము, సానుభూతి, త్యాగము యివన్నీ వారికి వుండే తీరాలి. ధైర్యమే లేకపోతే వారు అరణ్యములో కాలము గడపలేరు. పరాక్రమమే లేకపోతే ఏ పనికూడను సాధించటానికి వీలుకాదు. కనుక వ్యక్తిగతశీలముతోబాటు పైన చెప్పిన గుణములు అనుసరించి వుండినప్పుడే వారు ఏదైనా సాధించటానికి వీలవుతుంది. క్రోధము అవసరమేకదా అని ఎప్పుడంటే అప్పుడు దానిని వినియోగించరాదు. సమయాన్నిబట్టి జాతీయశీలతకు, వ్యక్తిగతశీలతకు భంగము కలుగకుండా వుండే పరిస్థితిలో దీనిని వుపయోగపెట్టుకోవాలి. వశిష్టులవారి తత్వాన్ని, వశిష్టులవారి శక్తి సామర్థ్యములను తానుకూడా సాధించాలనే వుద్దేశ్యముతో అనేక విధములుగా విశ్వామిత్రుడు తపస్సు చేశాడు. చివరకు యిది తపస్సుతో లభించేటువంటిది కాదని గుర్తించాడు. భౌతికశక్తులు నిరర్థకమని గుర్తించాడు. దైవబలమే నిజబలమని గ్రహించాడు. ఏనాడు యీ విధమైన సత్యాన్ని గుర్తించాడో అప్పుడే వశిష్టులవారికి పాదాక్రాంతుడయ్యాడు. అలా పాదాక్రాంతుడు కావటంచేత తన అహంకారము నిర్మూలమైపోయింది. అహంకారనిర్మూలనే బ్రహ్మర్షికి సరైన అర్హత అనుకున్నాడు. ఆనాటి గొప్ప గొప్ప మహనీయులందరు అహంకారమనేటువంటిదానిని నిర్మూలనము చేసి స్వార్థము, స్వప్రయోజనములను అణగద్రొక్కి, సహన సానుభూతులతో పవిత్రత పట్టుదలతో కార్యమును సాధిస్తూవచ్చారు.

srisathyasaivachanamrutam

**దైవానుగ్రహము, దైవబలమును సాధించటానికి పట్టుదల అవసరమే**

ఈనాడు విద్యార్థులకు పట్టుదల అవసరమే! అయితే యీ పట్టుదల మూర్ఖపు పట్టుదలగా వుండకూడదు. పవిత్రమైనదానిని సాధించే సమయములో పట్టుదల అత్యవసరము. దైవానుగ్రహమును, దైవబలమును, ధర్మబలమును సాధించటానికి పట్టుదల తప్పక అవసరమే! ఈ పట్టుదలలో మనము అనేక విధములైన పరాభవములు పొందవచ్చును. అవన్నీ విజయానికి సోపానములుగానే భావించాలి.

ఒక పెయింటరు వుంటాడు. ఆ పెయింటరు కుంచె తీసుకుని గోడకు పెయింటు రాస్తూ వుంటాడు. రాయటము చెరపటము, రాయటము చెరపటము యీ రీతిగా జరుగుతూవుంటాది. ఇవన్నీ తన అభివృద్ధికి మూలకారణములే! పూర్యకాలము చిన్న చిన్న పిల్లలకు అక్షరాభ్యాసము చేసేటువంటివారు. ఒకే పలకపైన వ్రాసి వ్రాసి అక్షరాన్ని గుర్తించుకొనేవారు. వ్రాయటము చదవటము, వ్రాయటము చదవటము అది ఒక వున్నతస్థితికి సోపానమే కదా! యుద్ధములో మహావీరుడుగా రూపొందవలెనన్న యుద్ధములో ప్రవేశించితీరాలి. అదేవిధముగనే శాంతిని మనము సాధించాలంటే అశాంతిలో మనము ప్రవేశించాలి. అశాంతిలోని ప్రశాంతి, ప్రశాంతిలోని ప్రకాంతి, ప్రకాంతిలోని పరంజ్యోతి, పరంజ్యోతిలోనే పరమాత్మతత్త్వము అన్నారు. ప్రకాశవంతమైన దీపమునకు ప్రకాశము రావాలంటే చీకటిలోనే పెట్టాలి దానిని. వెలుతురులో పెడితే దాని ప్రకాశమునకు విలువలేదు. దానివలనే pleasure is an interval between two pains అన్నారు. కనుక బాధలకు మనము లొంగిపోకూడదు. కృంగిపోరాదు. దైవముపై విశ్వాసము వుంచుకొని, నమ్మకము పెంచుకొని దానిని మనము అనుసరించటానికి ప్రయత్నించినప్పుడు యేలాంటి దీన్నైనా మనము సాధించుతాము. జగత్తులోపల ప్రాచీనకాలమునుండి నేటివరకు చరిత్ర రూపులుగా వచ్చిన వారందరు కేవలము వారు చేసిన ఘనకార్యములవలనకాదు, వారితో వున్న జాతీయశీలము, వ్యక్తిగతశీలము యీ రెండుశీలములను పోషించుకోటమే వారియొక్క ఘనకార్యము.

**అధికారదాహమనేది ఒక గొప్ప బలహీనత**

srisathyasaivachanamrutam

ఆధ్యాత్మిక మార్గమునందు అనేకమంది మహనీయులు అభివృద్ధిగాంచారు. వశిష్టుడు, సత్యవంతుడు, హరిశ్చంద్రుడు, ధర్మరాజు, శిబిచక్రవర్తి, బలిచక్రవర్తి, దధీచి వీరందరు యీ మార్గములో ప్రవేశించి అనేకరకములైన ఆదర్శములను అందిస్తూవచ్చారు. ఒక పక్షిని రక్షించటానికి తన ప్రాణాన్ని అర్పితము చేశాడు శిబిచక్రవర్తి. కనుక మంచిని రక్షించటానికి, మంచిని కాపాడటానికి కొంతవరకైనా మనము త్యాగము చేయటానికి సిద్ధముగా వుండాలి. అట్లుకాకుండా యేదో మాకు అధికారము, అధికారము అనుకుంటే యీ అధికారముతో లభించేది అవమానము, అగౌరవమే తప్ప సరియైనటువంటి శాంతిసుఖములు లభించవు. అధికారదాహమనేది గొప్ప బలహీనత.

ఒక చిన్న కథ. ఒక యింటిలో అత్తా, కోడలు వుండేటువంటివారు. యీ అత్తగార్కి గొప్ప అహంకారము. ప్రతి ఒక్కటి తన ద్వారానే జరగాలి అని ఒక విధమైన భ్రమ పెట్టుకుంది. ఒకనాడు పక్కింటికి పోయింది అత్తగారు, పనిపైన. ఆ సమయములోపల ఒక బిక్షగాడు యింటికివచ్చాడు. ఇంటికి వచ్చి 'భవతి బిక్షాందేహి' అన్నాడు. 'ఏమి నేను చెప్పింది నీకు వినబడటంలేదా పో, యిప్పుడు పెట్టటానికి వీలులేద'ని ఖండించింది కోడలు. సరే అని చెప్పి బిక్షగాడు బిక్క ముఖము వేసుకొని పోతున్నాడు, పాపం. అత్తగారు పక్కింటినుండి వస్తున్నారు. చూచింది తన యింటికి వచ్చిపోతున్నాడు యీ బిక్షగాడు అని. 'ఏరా మా యింటికి వెళ్లావా?' అని అడిగింది, బిక్షగానిని. 'వెళ్లాను, అమ్మగారు!' అన్నాడు. 'ఏమి? నా కోడలు యేమనింది?' అని అడిగింది. 'ఇప్పుడు పెట్టటానికి వీలులేదు పోమ్మ'ని చెప్పింది', అన్నాడు. 'నిన్ను పొమ్మని చెప్పటానికి నాకోడలికి అధికారము యేమిటున్నాది? రా! నావెంటరా!' అని తీసుకుపోయింది. 'ఆ మాట చెప్పే అధికారం నాకుంది కానీ, తనకెక్కడ వుంది? రా! నావెంట', అని తీసుకుపోయింది. ఈ బిక్షగాడు యేదో పెడుతుంది, అత్తగారు అనుకున్నాడు. పదినిముషాలు లోపలవుంది అత్తగారు. పదకొండో నిమిషము బయటకువచ్చి 'యిదుగో! పోయిరా! యేమీ లేదు', అంది. 'ఏమిటి అమ్మగారు! మీరు యెంతో ఆశచూపించి నన్ను పిలుచుకొని వచ్చారు. ఏమైనా వేస్తారని ఆశపడ్డాను. యేమీ పెట్టకుండా పొమ్మంటున్నారే', అని పాపం వాడు చాలా బాధపడ్డాడు. అప్పుడు యీ అత్తగారు చెప్పింది, 'యింటికి వచ్చిన వారిని పొమ్మని చెప్పటానికి అధికారము నాకుందిగానీ



sri sathyasai vahanamrutam

నా కోడలుకు యెక్కడవుంది? ఆ అధికారము చెలాయించటానికి నిన్ను పిలిచాన'ంది. ఇదేమన్నా అధికారంగా రూపోందుతుందా అవమానముగా రూపొందుతుందా కొంచెం యోచన చేసుకోండి. ఈ విధమైన తుచ్ఛమైన భావాల్లోపల అధికారము చెలాయించాలని మనము ప్రయత్నిస్తూ వుంటాము. మనము ఒక ఆఫీసులోపల అధికారిగానే వెళ్లవచ్చును. లేక యింకే విధమైనటువంటి ఫ్యాక్టరీస్‌లోపల MBA చేశారు కనుక అక్కడ నీవు ఒక ఆఫీసరుగా నిలువవచ్చు. కానీ అక్కడ యీ విధమైన అధికారములను చలాయించరాదు. వ్యక్తిగతశీలము కాపాడుకోవాలి. జాతీయశీలమునుకూడను మనము పోషించుకోవాలి. నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరిగేటువంటి మార్గాన్ని అవలంభించాలి. ఎలాటి పరిస్థితులయందు మనము అసత్యానికి గురికారాదు. ఈ అసత్యమనేటువంటిది ఒక విధమైన పెడమార్గము పట్టిస్తుంది. సత్యముకూడను శీలములో ఒక భాగము. కనుక సత్యాన్వేషణలోపల, సత్యవచనములోపల, సత్యము అనుసరించేటువంటి దానిలోపల కొంతవరకును జాగ్రత్త వహించాలి. సర్వమును కోల్పోయినాడు హరిశ్చంద్రుడు. కానీ, తన సత్యాన్ని మాత్రము కోల్పోలేదు. ఆ సత్యమును కాపాడు నిమిత్తమై ఆలుబిడ్డలను అమ్ముకున్నాడు, పాపం! నక్షత్రకునకు యివ్వవలసిన వడ్డీ డబ్బులుకూడను యివ్వలేకపోయాడు. తినటానికి తిండిలేదు. త్రాగటానికి నీరులేదు. తను వడ్డీ యేవిధముగా చెల్లించగలడు? అతని ధర్మపత్నికూడను అలాంటి సత్యవ్రతమునే ఆచరిస్తూవచ్చింది. భర్తకు యీ సత్యమునందు తగినటువంటి బలమును అందించేటువంటిది. ఒంటరిగా కూర్చొని విచారణచేస్తున్న సమయము పురస్కరించుకొని చంద్రమతి అతని పాదములుపట్టుకుంది.

**కాలగతి సర్వసంపదలు కోల్పోయె**
**మిగిలిన సిరినేను మీకును మీరునాకు**
**కాన యేకలవారికైన నన్నుఅమ్ముకొని**
**ఈ ఋషి ఋణంబు తీర్చుకొమ్ము**

అనింది. ఇలాంటి త్యాగానికి సిద్ధమైన వారివే చరిత్రలు. నన్ను అమ్ముకొని యీ

sri sathyasai vahini amrutam

ఋషిఋణము తీర్చుకొమ్మని యే సతియైనా పలుకుతుందా? 'బుద్ధిలేకుండా దానమిచ్చావు నీవు, కావలసివుంటే అరణ్యానికిపో! నేను నా పుట్టింటికిపోతాను', అంటారు యీనాడు. సమన్వయముచేత, సహనముచేత ఒకరియందు ఒకరు సానుభూతిని పెంచుకొని సత్యమును విడవకుండా త్యాగాన్ని అవలంబించటమే చరిత్రకు సరియైనటువంటి గుర్తు. ఇలాంటి వారి చరిత్రలు కొల్లలుగా వుంటున్నాయి. కనుక, ప్రాచీనుల చరిత్రలు మీరు అనుసరించండి. శిబిచక్రవర్తి, బలిచక్రవర్తి, ధధీచి వీరందరు యెంతో త్యాగము చేసినటువంటివారు. అట్టి మహనీయులవల్లనే భారతదేశముయొక్క చరిత్ర యీనాటికి పవిత్రముగా, దేదీప్యమానముగా వెలుగుతూవుంటున్నది. యుగములు మారినా, జగములు కదలినా వారు పేరులుమాత్రము ప్రఖ్యాతితో దేదీప్యమానముగా ప్రకాశిస్తూ వున్నాయి. గొప్ప విజ్ఞానవంతుడైనటువంటి ఐన్‌స్టీన్‌వంటివారి పేర్లుకూడా కరగిపోతూవస్తున్నాయి. ఈ విద్యలే అనిత్యములు. పదవులే అనిత్యములు. ఈ పరిశోధనలే క్షుద్రములు. అలాంటిది, శాశ్వత కీర్తిని మీరు యేరీతిగా సాధించగలరు? భారతదేశమునకు స్వరాజ్యము వచ్చి నలభై యేండ్లుకూడా కాలేదు. ఏదీ యీ మహనీయులయొక్క పేరు, ప్రతిష్ఠలు మనకు యెక్కడైనా వినపడుతున్నాయా? ఈ త్యాగశీలురయొక్క పేరు ప్రతిష్ఠలు యేమైనా వినబడుతున్నాయా? కాని, హరిశ్చంద్రుడు యేకాలమువాడు? సత్యవంతుడు యేకాలమువాడు? ధర్మరాజు యేకాలమువాడు? యీనాటికికూడను వారి కీర్తి, ప్రతిష్ఠలు దేదీప్యమానముగా ప్రకాశిస్తూనే వున్నాయి. అట్టివారే అమరజీవులు. వారిదే అమృతమయమైన జీవితము. వారిదే చరిత్రప్రఖ్యాతి గాంచినటువంటి తత్వము. అలాంటివారే ఆచార్యులు. కనుక, అట్టి ఆచార్యులైనటువంటి వారియొక్క తత్త్వమును, వారి అడుగుజాడలను అనుసరించటము ప్రతి మానవునకు కర్తవ్యము.

**ఆత్మయే స్వదేశము**

ఈనాడు ముఖ్యముగా జాతీయశీలత, వ్యక్తిగతశీలత యీ రెండు కలసినటువంటివారే ఆదర్శవంతమైన పురుషులు అనేటువంటి సత్యమును గుర్తించాము. ముఖ్యముగా మన Institute పిల్లలు అందరుకూడను వ్యక్తిగతశీలమే కాకుండా జాతీయశీలమునుకూడను

sri sathyasai vahanamrutam

పెంపొందించుకోవాలి. దేశమును మనము ప్రేమించాలి. దేశక్షేమాన్ని మనము కోరాలి. దేశముకొరకు మనము త్యాగము చేయాలి. ఈ దేశములో పుట్టినందుకు యిదే నా కర్తవ్యమని దృఢముగావించుకోవాలి. 'ఇది నా మాతృభాష. ఇది నా దేశము' అని యెదగొట్టి చెప్పటానికి సంసిద్ధులుకావాలి. నాది పవిత్రమైన భారతదేశము. నా దేశము త్యాగభూమి. తపఃభూమి. ఇలాంటి భూమిలో పుట్టినటువంటి నేను క్షుద్రునిగా, చిన్నవానిగా, సంకుచితమైన మార్గములో ప్రవేశించరాదు, అనే విశాలమైన భావమును అభివృద్ధి పరచుకోవాలి. మనము తినే తిండి భారతదేశముది. మనము తాగే నీరంతా భారతదేశముది. మనము నివశించేదేశము భారతదేశము. మనము పీల్చుకొనే గాలంతా భారతదేశముయొక్క వాతావరణమే! ఈ పంచభూతాల్ని మనము అనుభవిస్తూ భారతదేశమునకు కృతజ్ఞత చూపనక్కరలేదా? అందుకోసమే గాంధీకూడా చెప్పాడు. స్వదేశముయొక్క వస్త్రాన్ని మాత్రమే, వస్తువులు మాత్రమే మీరు వుపయోగించాలి, విదేశీ వస్తువులు వుపయోగించరాదన్నాడు. కారణంయేమిటి? విదేశీ వస్తువులు వుపయోగించుకుంటూ వస్తే మనమంతా మనదేశాన్ని మరచిపోయి విదేశమునే విశ్వసిస్తూ దానినే మనము ఆధారము చేసుకుంటూ వుంటామనే వుద్దేశ్యముతో దానిని త్యజించేమార్గానికి బోధన చేస్తూ వచ్చాడు. స్వరాజ్యము సంపాయించటానికి స్వదేశవస్తువులే వుపయోగించాలి, అన్నాడు. నా వుద్దేశ్యముకూడా అదే! ఆ స్వదేశ వస్తువు యేదంటే ఆత్మే స్వదేశ వస్తువు. మనసు, బుద్ధి, చిత్తము, అంతఃకరణ యివన్నియు విదేశవస్తువులే! ఎప్పుడో మారిపోయేటువంటివే! ఎప్పుడో కూలిపోయేటువంటివే! స్వదేశవస్తువు అదే ఆత్మ. స్వదేశము ఆత్మదేశము. ఈ ఆత్మదేశమును మనము అనుసరించాలిగానీ యీ విదేశవస్తువులంతా అనుసరించరాదు. మనసు, బుద్ధి, చిత్తము, అంతఃకరణలకంటే ఆత్మయందు లక్ష్యమునుంచుకోటమే విద్యార్థుల ప్రధానకర్తవ్యమని విశ్వసించి మీరు ఆదర్శమును నిరూపించాలని ఆశీర్వదిస్తున్నాను.

**(తేదీ 01-03-1987న ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini